## 5-45

### మున్నుడి

హరినామ వైశిష్ట్యాన్ని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. దేవతలు మునులు శోధనచేసి కనుక్కొన్నారట దాని మహాత్మ్యాన్ని. ఆ శ్రీహరినామం ఇప్పటిదా? అదతీ ఆదికిన్ అనాదియైనది (అత్యంత పురాతనమైన) దంటున్నారు. "సకల పుణ్యఫలములకు సార విహారము" అంటున్నారు. (సర్వపుణ్యముల ఫలములు ఫలించెడి తోట... అని అర్థం). ఏ ఫలము పెద్దదో, ఏది చిన్నదో, ఏది రుచిగలదో ఏది రుచిలేనిదో ఆయన తప్ప ఎవరు చెప్పగలరు? శ్రీహరినామము నాశ్రయించిన వారిలో కుటిలత్వము అంటే వంకరబుద్ధి వుండదట.

**ఆ.వె॥సురులు మౌనులున్ను సోదించి రిద్దియే**
**అకుటిలంబులు యనిరి అన్నమయ్య**
**ఆదికిని అనాది హరినామమొక్కటే**
**మేటి కీర్తనంబు వేంకటేశ!**

**రాగం: లలిత**

సోదించి రిదియే సురలును మునులును
ఆదికి ననాది హరినామం ॥సోదించి॥

అరిది వేదశాస్త్రార్థ సంగ్రహము
అరయగ నొకటే హరినామం
దురితహరము భవదుఃఖనాశనము
అరి భయంకరము హరినామం ॥సోదించి॥

సకల పుణ్యఫల సార విహారము
అకలంకము శ్రీహరినామం
ప్రకటము సులభము పరమపావనము
అకుటిలమిది శ్రీహరినామం ॥సోదించి॥





కందువ సదరము కైవల్యపదము
అందరికిదియే హరినామం
యొందును శ్రీవేంకటేశ్వరు కరుణకు
నందుకోలైన హరినామం ॥సోదించి॥

**భావామృతం :**

ఓ నరులారా! ఈ శ్రీమన్నారాయణుని హరి... హరి... అని కీర్తించండి. ఈ హరినామం ఇప్పటిదికాదు. ఇది అనాది అని పిలువబడిన ప్రతిదానికంటే... ఆది (మొదలు) అయినది. ఈ విషయాన్ని దేవతలు, మునులు పరిశోధించి, మరీ కనుక్కున్నారు.

ఈ శ్రీహరినామం, అరిది వేద శాస్త్రముల (దుర్లభమైన చతుర్వేదములు, షట్ శాస్త్రముల) సంగ్రహము (సారము). పరిశీలించగా ఇదొక్కటే ఇట్టి విశిష్టత కలిగియున్నది. ఈ శ్రీహరినామము పాప నిర్మూలకము. పుట్టుక అనెడి దుఃఖమును నివారించునది. దీనిని నమ్మిన వారికి శత్రువుల పీడ లేకుండ చేయునది. మరి శ్రీహరీ... అని ఆ దేవదేవుని నామమును యొందుకు ఆశ్రయించరు?

ఈ శ్రీహరి నామము అకలంకము (ఏ నిందాలేనిది). సర్వపుణ్యములు (అనగా గత జన్మలో మనం చేసినకొనిన పుణ్యములు ఈ జన్మలో చేసికొనిన పుణ్యములు, ఇంకొకరి ద్వారా సంక్రమించిన పుణ్యములు) ఫలించెడి సారవిహారము (పండ్లతోట). ఈ శ్రీహరినామము అకుటిలము (ఏమాత్రము వంకర బుద్ధి లేనిది). ప్రకటము (అందరికీ తెలియునట్లు ప్రకటించబడినది). ఇది సులువైనది. ఎంతో పునీతమైనది.

ఓ ప్రజలారా! ఈ శ్రీహరినామమే అందరికీ కైవల్యపదము (ముక్తి మార్గము నొసగునది). ఇది కందువ సదరము (కందువన్... చదరము అనగా సామర్థ్యమున ఏ మాత్రము కొఱతలేనిది). శ్రీ వేంకటేశ్వరుని కరుణకు యొందును (ఎక్కడనైన) అందుకోలై (అతి సమీపముగా వున్నదై) ఈ హరినామము సర్వులను ఉద్ధరించుచున్నది.